క్లుప్తంగా

పగటి కలలు మానుకోవాలి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పగటి కలలుకనడం మానుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తాండూరు మండలాన్ని హస్తగతం చేసుకుంటామని చెబుతున్న ఆయన అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారని బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. కోనాపూర్, చెన్‌గేస్‌పూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరినట్లు వస్తున్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని తేల్చేశారు. చెన్‌గేస్‌పూర్‌లో బీఆర్‌ఎస్‌కు పట్టు ఉందని వివరించారు. తాండూరు మండలంలో జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తాచాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సహకారంతో అధిక స్థానాలను కై వసం చేసుకుంటుంని ధీమా వ్యక్తం చేశారు.

ఆర్టీఐ చట్టంపై అవగాహన తప్పనిసరి

డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్



అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్

పరిగి: ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఆర్టీఐ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని పౌరసమాచార అధికారి, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ సూచించారు. ఆర్టీఐ చట్టం వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ చట్టంపై అధికారులకు ఉండే బాధ్యతలను వివరించారు. అనంతరం విజయేందర్ మాట్లాడుతూ ఆర్టీఐ దరఖాస్తులకు జవాబు చేయడానికి 30 రోజుల గడువు ఉంటుందని, గడువులోగా నిర్దేశిత సమాధానం ఇవ్వని పక్షంలో అప్పీల్ చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. సామాన్య పౌరులకు ఆర్టీఐ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కావున ప్రతిఒక్కరూ ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్‌ఐ శైలజ

బంట్వారం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బుధవారం పోలీసులు అందజేశారు. బార్వాద్‌కు చెందిన బంటు అనిత, కోట్‌పల్లి నివాసి జోషి వెంకటేశ్ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. ఈ విషయమై ఇరువురు కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు నిర్వహించిన పోలీసులు రికవరీ చేసి బుధవారం బాధితులకు అప్పగించినట్లు ఎస్‌ఐ శైలజ తెలిపారు.

విద్యార్థికి అభినందన



స్నేహితను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మాలతి

మొయినాబాద్‌రూరల్: 69 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని స్నేహిత బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ మాలతీ అన్నారు. బుధవారం విద్యార్థినికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాలలో పాలు పంచుకున్నప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. క్రీడాపోటీల్లో స్నేహిత బంగారు పతకాన్ని తీసుకురావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ పోటీలు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించారని తెలిపారు. స్నేహితకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ రాంచంద్రుడు, మేడ్చెల్ జిల్లా కార్యదర్శి కిష్టయ్య, వికారాబాద్ జిల్లా కార్యదర్శి అనంతయ్య ప్రశంసా పత్రాన్ని అందజేసి బంగారు పతకాన్ని ఇచ్చారని తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన

శంకర్‌పల్లి: పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్లను బుధవారం ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్‌బేగ్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి, వారి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం పరిసరాలు, నీటి లభ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి
- మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి
- కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌రెడ్డి

దోమ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని ఎస్‌జీ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో కారు జోరును ఎవరు ఆపలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండేళ్లు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నేటికి అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతలు ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఓటును అభ్యర్థించాలన్నారు.

అక్రమ కేసు బనాయించి జైలుకు పంపారు..

మైనింగ్ కేసులో తనను అక్రమంగా అరెస్టు చేయించి 45 రోజుల పాటు బెయిల్ రాకుండా జైలుకు పంపారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పుల నాగిరెడ్డి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేకే తనపై కేసు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న మైనింగ్ లీజులో ఇంకా నాలుగు ఎకరాలు మైనింగ్ చేయడానికి ఆస్కారం ఉందని, ఒక ఎకరం ఎక్కువ తవ్వారంటూ కేసు నమోదు చేయించి ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందన్నారు. కక్ష సాధింపు రాజకీయాలతో సాధించేదేమి లేదన్నారు. ప్రజాధరణ ఉన్నంత కాలం తనను ఎవరు ఏమి చేయలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుది శ్వాస వరకు ప్రజల కోసమే పని చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ కో ఆప్షన్ ఖాజపాషా, మాజీ ఎంపీపీ వెంకటయ్య, మాజీ వైస్ ఎంపీపీ నర్సింహులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కిష్టాపురం కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు హన్మంతునాయక్, పరిగి మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, యూత్ అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాఘవపురం రాములు, మండల మహిళా అధ్యక్షురాలు కోమటిబాయ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, జగత్‌రెడ్డి, రామన్నమాదిగ, శశిధర్‌రెడ్డి, హైమద్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

జీపీవోలకు క్లస్టర్ల కేటాయింపు

తాండూరు రూరల్: తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేయాలనే లక్ష్యంతో గ్రామ పాలన అధికారులను నియమించింది. ఇందులో భాగంగా తాండూరు మండలంలో 36 రెవెన్యూ గ్రామాలకుగాను 11 మందిని తీసుకొని 22 క్లస్టర్లుగా విభజించి బాధ్యతలు అప్పగించినట్లు తహసీల్దార్ తారాసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 మందిలో ఏడుగురు జీపీఓలుగా, నలుగురు జూనియర్ అసిస్టెంట్లను కలిపి జీపీఓలుగా నియమించారని పేర్కొన్నారు. ఒక్కో జీపీవోకు రెండు క్లస్టర్లు కేటాయించారని అధికారులు తెలిపారు. వర్త్య తేజస్ నాయక్(కోటబాసుపల్లి క్లస్టర్), పి.వెంకటప్ప (కరన్‌కోట్ క్లస్టర్), ఈర్ల రాంచంద్రయ్య (గౌతపూర్ క్లస్టర్), బి.కృష్ణప్ప (నారాయ ణపూర్), బి.చిన్న నర్సిములు (వీరారెడ్డిపల్లి), జీ.నర్మద (చెంగోల్, అంతారం), నీరాటి వెంకటయ్య (జినుగుర్తి), పి.నాగమణి (తాండూరు), నర్సిములు (మల్రెడ్డిపల్లి), కె.బాబు(సాయిపూర్), బి.నరేష్(తాండూరు) క్లస్టర్లను కేటాయించినట్లు తెలిపారు.

పెద్దేముల్‌లో 12 మంది...

పెద్దేముల్ మండలంలో 38 రెవెన్యూ గ్రామాలకు 12 మంది జీపీవోలకు 15 క్లస్టర్లుగా విభజించి బాధ్యతలు అప్పగించినట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఇందులో నరేందర్‌గౌడ్(గాజీపూర్ క్లస్టర్), కావలివెంకన్న(ఇందూర్), రాకేశ్(తట్టెపల్లి-2), బిచ్చప్ప(పెద్దేముల్-1, 2), హరిత(నాగులపల్లి), శ్రీహరి(తట్టెపల్లి-1), కావలిశివయ్య(మంబాపూర్), తలారి గోపాల్(కొండాపూర్), కావలి వెంకటేష్(మారెపల్లి), మహిపాల్ (అడికిచెర్ల), అభినాష్(గోట్లపల్లి), సునీల్‌కుమార్(జనగాం) క్లస్టర్లను కేటాయించారు. ప్రస్తుతం జీపీవోలు విధుల్లో చేరి ఓటరు జాబితాపై కసరత్తు చేస్తున్నారు.

ఎన్నికల అధికారుల నియామకం

తాండూరు రూరల్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో భాగంగా పెద్దేముల్ మండలానికి ఆర్వోలను నియమించారు. జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి మైన్స్ ఏడీ సత్యానారాయణను ఎన్నికల అధికారిగా ప్రకటించారు. మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలను నాలుగు క్లస్టర్లుగా విభజించారు. ఆ క్లస్టర్లకు ఐదుగురిని ఆర్వోలుగా, మరోఐదుగురిని అసిస్టెంట్ ఆర్వోలుగా నియమించినట్లు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో తట్టెపల్లి, పాషాపూర్, అడికిచెర్ల ఎంపీటీసీ క్లస్టర్లకు ఆర్వోగా (పవన్ ప్రీతం), ఇందూర్, జైరంతండా, గాజీపూర్‌లకు (శ్రీనివాస్), పెద్దేముల్, నాగులపల్లి, జనగాంకు (కృష్ణయ్య), మంబాపూర్, కందనెల్లి, రుక్మాపూర్, కొండాపూర్‌లకు (వినోద్‌కుమార్)ను జిల్లా యంత్రాంగం నియమించినట్లు పేర్కొన్నారు. ఆర్వో ప్రతిభ రిజర్వులో ఉంటారని తెలిపారు. ఎంపీటీసీ క్లస్టర్లకు ఐదు మంది ఆర్వోలతో పాటు మరోఐదుగురిని అసిస్టెంట్ ఆర్వోలుగా నియమించారు. ఇందులో గోపాల్, శ్రీనివాస్‌రావు, పాండురంగం,"ససత్యం, శేఖర్ ఉన్నారు.

తుది ఓటరు జాబితా సిద్ధం

పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం

తాండూరు రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పెద్దేముల్ మండలంలో మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటికి సంబంధించి తుది ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేశారు. మండలంలో మొత్తం ఓట్లు 40,828 ఉన్నాయని మండల కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఇందులో 19,804 పురుషుల ఓట్లు, 21,024 మహిళా ఓటర్లుగా ఉన్నారన్నారు. పురుషులకంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి.

ఎంపీటీసీల వారీగా..

ఎంపీటీసీల వారీగా ఓటరు జాబితా ఇలా ఉంది. అడికిచెర్ల ఎంపీటీసీ పరిధిలో (2,704), పాషాపూర్ (3,122), తట్టెపల్లి(4,450), నాగులపల్లి(3,027), ఇందూర్(4,149), పెద్దేముల్(4,194), జనగాం (3,095), గాజీపూర్(2,902), జైరంతండా(2,664), కందనెల్లి(2,881), మంబాపూర్(2,502), రుక్మాపూర్(2,064), కొండాపూర్(3,074)ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఒక్కో ఎంపీటీసీ క్లస్టర్ కింద మూడు నుంచి నాలుగు గ్రామాలు ఉన్నాయి.

ఎన్నికల సామగ్రి పరిశీలన

తాండూరు రూరల్: స్థానిక సంస్థలకు ఎన్నికలు సందర్భంగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. జెడ్పీ కార్యాలయం నుంచి మండలానికి వచ్చిన ఎన్నికల సామగ్రిని ఎంపీడీఓ సమావేశ మందిరంలో విశ్వప్రసాద్ బుధవారం మరోసారి పరిశీలించారు. మండలానికి 86 రకాల నమూనా ఫారాలు, కవర్లు, పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, ప్రచార ఖర్చుల పుస్తకాలు, అఫిడవిట్ పత్రాలు, పోస్టర్ బ్యాలెట్ కవర్లు, ఎన్నికల నియమావళి కరదీపికలు సరిచూసుకున్నారు. ఏజెంటు పత్రాలు, ఏజెంటు గుర్తింపు కార్డులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి సలహా, సూచనలు చేశారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచు ఎన్నికలకు సంబంధించి అన్ని సామగ్రి అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు.



ఎన్నికల సామగ్రిని సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

మెరుగైన విద్యా బోధనే ధ్యేయం

మండల విద్యాధికారి వెంకట్

దోమ: మెరుగైన విద్యా బోధనే ధ్యేయమని మండల విద్యాధికారి వెంకట్ పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలన్నారు. దీని కోసం ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు రఘువీర్, రేణుక, సీఆర్‌పీ రెడ్యానాయక్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మాట్లాడుతున్న నాగయ్య

మర్పల్లి: వికారాబాద్ పట్టణంలోని మహవీర్ ఆస్పత్రి వైద్య నిపుణులు సిరిపురం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చిందని బీజేపీ మండల సీనియర్ నాయకుడు సీబీఎస్ నాగయ్య పేర్కొన్నారు. తమ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని మహవీర్ ఆస్పత్రి మార్కెటింగ్ అధికారి మురళీమోహన్‌ను కోరిన వెంటనే ఏర్పాటు చేయించారన్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన శిబిరంలో వందలాది మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. అనంతరం మురళీ మోహన్ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకునే వారికి ప్రత్యేక వైద్య సదుపాయం అందజేస్తామన్నారు. కంటి శుక్లా ఉన్న వారికి కేవలం రూ. 1000కే ఆపరేషన్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ వైద్యులు డాక్టర్ శ్రీసాయి, డాక్టర్ లేఖ్య, ప్రియాంక, కంటి వైద్య నిపుణులు రాజేశ్వరి, గైనకాలజిస్టు డాక్టర్ శ్రీదేవి, ఏఎన్‌ఎం సుజాత వార్డుబొయ్ జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల తరలించొద్దని వినతి

కొడంగల్ రూరల్: అప్పాయిపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన మెడికల్ కళాశాలను, పాతకొడంగల్‌లోని ఇంటిగ్రెటెడ్ పాఠశాలల సముదాయాలను తరలించొద్దని ఉపాధ్యాయ బృందం బుధవారం కడా కార్యాలయ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్ అభివృద్ధికి కృషిచేయాలని, ప్రారంభించిన పనులను పూర్తి చేయకుండా వేరే చోటికి తరలించడం సమంజసం కాదన్నారు. అప్పాయిపల్లిలోని మెడికల్ కళాశాల, పాతకొడంగల్‌లోని ఇంటిగ్రెటెడ్ పాఠశాలల సముదాయాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వెలువడుతున్న వార్తల నేపథ్యంలో వినతిపత్రం అందిస్తున్నట్లు ఉపాధ్యాయ బృందం పేర్కొన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉపాధ్యాయులు అబ్దుల్‌హాక్, కృష్ణకుమార్, కరుణాకర్, ఆశప్ప, ఎఫ్.నర్సిములు, నర్సింగ్, నాగప్ప, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కడా కార్యాలయ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: మండలంలో ఒక జెడ్పీటీసీ, తొమ్మిది ఎంపీటీసీ స్థానాలకు గురువారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నామని మండల అభివృద్ధి అధికారి సంధ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ కోసం బుధవారం అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ ఉదయం 10.30 నుంచి 5 గంటల వరకు మూడురోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. రిజర్వేషన్లను బట్టి నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. క్లస్టర్ల వారీగా తొమ్మిది ఎంపీటీసీలకు మూడు క్లస్టర్‌లను ఏర్పాటు చేశామని, జెడ్పీటీసీకి ఒక రిటర్నింగ్ అధికారిని ఏర్పాటు చేశామని వెల్లడించారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మేడిపల్లికలాన్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు తెలుగు నర్సింలు, వెంకట్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, బాలరాజు, శ్రీకాంత్, అనుక్, పత్తి వెంకటేష్‌తో పాటు పలువురు నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి స్థానిక అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్, ఆత్మకమిటీ చైర్మెన్ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్, మాజీ సర్పంచ్ క్రిష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ముక్కంటి, శ్రీనివాస్‌గుప్తా, రాజవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మరో ఉపాధ్యాయుడిని కేటాయించండి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న సాగారం తండావాసులు

డీఈవో రేణుక దేవిని కోరిన సాగారం తండావాసులు

దుద్యాల్: మండల పరిధిలోని సాగారం తండా పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక దేవిని తండావాసులు బుధవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు తరగతులలో 52 మంది విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఇంత మందికి బోధించాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని, బోధనలో న్యాయం జరగదని తండావాసులు డీఈవో దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన రేణుక దేవి దుద్యాల్ మండల విద్యాశాఖ అధికారికి ఫోన్ చేసి గురువారం నుంచి మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని ఆదేశించినట్లు తండావాసులు తెలిపారు. వెంటనే స్పందించి మరో ఉపాధ్యాయుడిని కేటాయిస్తున్నందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సాగారం తండా కాంగ్రెస్ అధ్యక్షుడు నరేశ్ రాథోడ్, గోపాల్ నాయక్, లాలు నాయక్, కరుణాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: స్థానిక ఎన్నికల సందర్భంగా నామినేషన్లు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌ఓ, ఏఆర్‌ఓలు, కార్యదర్శులు, జీపీఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని 12 ఎంపీటీసీ స్థానాలకు గాను నామినేషన్లను స్వీకరించనున్నామన్నారు. నామినేషన్ల దాఖలుకు అభ్యర్థి, ఇద్దరు ప్రతిపాదకులతో పాటు మరో వ్యక్తిని మాత్రమే లోపలికి అనుమతిస్తామన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. దీని కోసం పోలీస్ బందోబస్తును కూడా ఏర్పాటు చేయించామన్నారు. అన్ని పార్టీల అభ్యర్థులు దీనికి సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అరవింద్, ఎంపీఓ యాదగిరి, సూపరింటెండెంట్ రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయలక్ష్మి, ఎస్‌ఐ అరవింద్ తదితరులు

అవమాన పరిచిన వ్యక్తిని శిక్షించాలి



కొడంగల్ రూరల్: నిరసన ర్యాలీలో నాయకులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

కొడంగల్ రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌ను అవమాన పరిచిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. బుధవారం యువజన నాయకులు కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఐ లవ్ అంబేడ్కర్ నినాదంతో భారీ ర్యాలీ చేపట్టి ధర్నా చేశారు. పట్టణంలోని గాంధీనగర్ కాలనీ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఇది కొనసాగింది. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా వద్ద దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, రావులపల్లి కాకులారం ఉదయ్‌కుమార్, కుప్పగిరి అశోక్, కస్తూర్‌పల్లి వెంకట్, పర్సాపూర్ మాజీ సర్పంచు సయ్యద్ అంజద్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దాడి సిగ్గు చేటు..

పరిగి: న్యాయమూర్తిపై దాడికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని బుధవారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ దాడి కేవలం వ్యక్తిపై కాదు భారత ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క మూలాస్తంభాలపై, రాజ్యాంగంపై, న్యాయ వ్యవస్థపై జరిగినదిగా భావించాలన్నారు. న్యాయ వ్యవస్థ బతికి ఉండాలంటే ఇలాంటి దుర్మార్గులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఎంపీడీఓ గ్యామాకు వినతి పత్రం అందజేత

దోమ: అవినీతి, అక్రమాలకు పాల్పపడుతున్న పంచాయతీ కార్యదర్శి రవి కుమార్‌పై చర్యలు తీసుకోవాలని రాకొండ గ్రామస్తుల డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గ్యామాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పారదర్శకంగా విధులు నిర్వహించడం లేదన్నారు. కేవలం అధికార పార్టీ నేతలకు అండగా ఉంటూ తనకు అనుకూలమైన వారికే ఇళ్ల అనుమతులు ఇస్తున్నారని వాపోయారు. ఇతరులకు అనుమతులు ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేసుకునేందుకు వివాహధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు కూడా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపించారు. డబ్బులు ఇవ్వని వారిని నెలల తరబడి తిప్పించుకుంటూ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయం గురించి ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో గ్రామంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



గ్యామాకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పోలీసుల తనిఖీలు ప్రారంభం

మొయినాబాద్: పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోలీసుల తనిఖీలు ప్రారంభమయ్యాయి. బుధవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఏసీపీ కిషన్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. చేవెళ్ల నుంచి నగరంవైపు వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎవరూ రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు దగ్గర పెట్టుకోవద్దని, ఉంటే సీజ్ చేస్తామన్నారు. ఎస్‌ఐలు నర్సింహారాజు, కిషన్‌జీ, నయీమొద్దీన్, కానిస్టేబుళ్లు ఉన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ కిషన్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి